# విలేజ్

**26** ఏప్రిల్, 2099

ఇండియన్ స్టేట్,

గ్లోబల్ వరల్డ్,

యూనివర్స్,

సాయంత్రం ఆరున్నర కావస్తోంది...

పడమట సూరీడు కుంగిపోతుంటే... తూర్పున మెటాస్టిక్ సోలార్‌సన్ ఉదయిస్తోంది. రోజులో పని గంటలు సరిపోకపోవటంతో... ఆకాశంలో అమర్చిన ఎలక్ట్రానిక్ సూర్యుడు నాలుగ్గంటలు వెలుతురిచ్చి అస్తమిస్తాడు.

ఆ వెలుతురు భూమ్మీద పడే సమయాన...

'గాప్' సెంటర్ (గ్యాప్ అంటే జి.ఎ.పి. గోల్డెన్ ఆంధ్రప్రదేశ్...లోని సైబరాబాద్ సిటీలో... ఓ ఇంట్లోని వ్యక్తి జేబులో పెన్‌ఫోన్ మోగింది.

"హలో... రాజేంద్ర హియర్" అన్నాడు.

"నేను న్యూయార్క్‌నించి.. స్టీఫెన్‌ని మాట్లాడుతున్నాను.

"నువ్వో హత్య చేయాలి" అన్నాడు అవతలి వ్యక్తి.

"వివరాలు...?" కూల్‌గా అడిగాడు రాజేంద్ర.

చెప్పాడు స్టీఫెన్.

"చాలా కష్టమైన పని... అంత తేలిక కాదు... ఎంత పే చేస్తారు?

"అరవై కోట్లు... ఏ దేశపు కరెన్సీలో నైనా కోరుకోవచ్చు... కాని పని జరగాలి"

"సారీ" అన్నాడు రాజేంద్ర.

"మరేం కావాలి...?"

"నాకు కరెన్సీ వద్దు"

"ఇంకేం కావాలి?"

"చంద్రుడి మీద అర ఎకరం ఫ్లాట్ కావాలి"

"చాలా... చాలా ఎక్కువ కోరుతున్నావ్"

"నువ్వు చెప్పిన హత్య మామూలుది కాదు"

అవతల్నించి నిమిషం పాటు నిశ్శబ్దం...

"ఒకే... కాని రెండ్రోజుల్లో పని జరిగి పోవాలి"

"రేపే...!"

స్టీఫెన్ నవ్వాడు. "నాకు తెల్సు నువ్వు సమర్థుడివి"

ఇంతకీ ఎందుకీ హత్య చేయాలి?" అడిగాడు రాజేంద్ర.

"కారణాలేమిటో హైకమాండ్ నాక్కూడా చెప్పలేదు"

"సరే... రేపు టీవి న్యూస్ చూడు..." రాజేంద్ర అనగానే అవతలి ఫోన్ కట్ అయింది.

XXX XXX XXX

మర్నాడు...

తూర్పున నిజం సూర్యుడు (రియల్ సన్) ఉదయిస్తున్న సమయాన.. ఆ మరణవార్త విని ఇటు ప్రజలు.. అటు భారత ప్రభుత్వం విస్తుపోయింది. ఐక్యరాజ్య

సమితి కూడా దిగ్భ్రాంతికి గురై... విచారాన్ని ప్రకటించింది.

ఆ వార్త కలవరం లేపింది....

కలకలాన్ని సృష్టించింది...

భారత ప్రభుత్వం ఒక రోజు సెలవు ప్రకటిస్తూ... మూడ్రోజుల సంతాప దినాల్ని ప్రకటించింది. ప్రతి ఒక్క భారతపౌరుడి కళ్లలోంచి... ఒక ఆత్మీయుడు వెళ్లిపోయిన విషాదం... జాలువారిన కన్నీరు.

మృతదేహాన్ని ప్రజల సందర్శనార్థం 'సైటెక్ సిటీ'కి తరలించారు.

అప్పటికే స్వర్ణాంధ్రదేశ్ చీఫ్ మినిస్టర్‌కి... దేశదేశాల (వీధివీధి) నుంచి ప్రముఖుల సంతాప సందేశాలు అందుతూనే ఉన్నాయి.

అంత్యక్రియల్ని ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించడానికి... ప్రభుత్వం నిమగ్నమై ఉంటే... ఆ 'శవయాత్ర'ని పదహారు వందల చానెల్స్ లైవ్ టెలీకాస్ట్ చేయడానికి సిద్ధమై... సైబరాబాద్ చేరుకున్నాయి.

అప్పటికే మృతుడికి సంబంధించిన కథనాలు, క్లిప్పింగ్‌లతో ప్రసారం చేస్తున్నాయి. వార్తా పత్రికలు స్పెషల్ బులెటిన్లు వేయడానికి సన్నద్ధమయ్యాయి.

శవయాత్ర పకడ్బందీగా సాగేలా... జడ్ క్యాటగిరీ సెక్యూరిటీ వీడియో టాకీలతో అలర్ట్ అయ్యారు.

దేవాలయల్లో...

మసీదుల్లో...

చర్చిల్లో...

ఆత్మశాంతికై హోమాలు, పూజలు, భజనలతో ఇండియన్ స్టేట్ యావత్తూ భక్తి ప్రపత్తులతో ప్రార్థించింది.

శవంపై 'జాతీయ జెండా'ని గవర్నర్ వేదవ్యాస కప్పారు. పూలదండలతో అలరించిన మిలిట్రీ శకటం మీద... మృతుడి దేహాన్ని ఉంచారు.

శవయాత్ర కదిలింది.

మౌనం... అంతా మౌనం... విషాదం లోంచి వచ్చిన మౌనం.

నాలుగు కిలోమీటర్ల దూరానికి... ఎనిమిది గంటలు పట్టింది. లక్షలాది జనం... ఫ్లాష్ కెమెరాలు... వీడియో కెమెరాలు... తమ పని చేసుకుపోతున్నాయి. ఆ శవయాత్రని ప్రపంచమంతా టీవిల్లో భారమైన గుండెల్తో చూస్తుండిపోయింది.

ఏ రకమైన దహనం చెయ్యాలి? ఎలక్ట్రిక్ బర్నింగా? ఒకప్పటి సంప్రదాయ దహనమా? లేక సమాధిలైపా? అన్న విషయంలో మేధావులతో వేసిన కమిటీ ప్రభుత్వానికి సాంప్రదాయక దహనం చేయటమే సరైన శ్రద్ధాంజలి అని తన రిపోర్ట్‌ని ప్రభుత్వాని అప్పటికే అందజేసింది.

అందుకేనేమో... కట్టెలతో చితి పేర్చారు.

శవాన్ని చితిపై పడుకోబెట్టాక... 'అమర్‌రహే' అన్న నినాదాలు

మిన్నుముట్టాయి. మిలిట్రీ గాల్లోకి అయిదువందల రౌండ్లు కాల్పులు జరిపింది. మిలిట్రీ కమాండర్ గవర్నర్ వేదవ్యాస ఆదేశాల మేరకు చితికి నిప్పంటించాడు.

నింగికెగిసిన మంటలు...

అతి భారంగా వెనుదిరిగారు. మింగుడు పడని విషాదం...

చితిని చుట్టేసిన అగ్నికీలల్లో...

భారత జాతీయ జంతువు 'పెద్దపులి' కాలి బూడిదైపోయింది.

ప్రపంచం మొత్తంమీద మిగిలిపోయిన ఏకైక 'పులి' మరణం... మానవ జాతిని కుంగదీసింది.

సరిగ్గా అదే సమయానికి...

శ్మశానవాటిక నించి బయల్దేరిన గవర్నర్ వేదవ్యాస రాజేంద్రనగర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లారు. అప్పటికే విమానాశ్రయం చుట్టూ మిలిట్రీ మోహరించి ఉంది. గవర్నర్‌ని చూడగానే ఎయిర్‌పోర్ట్ అధికారులు, మంత్రులు లేచి నిల్చున్నారు. అంతా 'లాబీ'లో కూచొని అమెరికా నుంచి రాబోయే ప్రత్యేక విమానం కోసం ఎదురు చూడటం మొదలెట్టారు. విమానం పది నిమిషాలు లేటవడంతో... గవర్నర్, అమెరికా విదేశాంగ మంత్రితో కుదుర్చుకున్న ఒప్పందం ఫైలుని ఓసారి పరిశీలించారు.

విమానం చాలా తక్కువ సౌండ్‌తో వచ్చి ల్యాండ్ అయింది. అందులోంచి అమెరికన్ రాయబారితో పాటు నలుగురు మిలిట్రీ ఆఫీసర్స్ ఓ గాజుతొట్టిని పట్టుకొని దిగుతుంటే... గవర్నర్, చీఫ్ సెక్రటరీ మరికొందరు వారికెదురుగా వెళ్లారు.

వాళ్లని సాదరంగా ఆహ్వానించారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ గవర్నర్ వేదవ్యాస అత్యంత అరుదైన "నెమలి ఈక"ని భారత ప్రజల గౌరవార్థం ప్రేమగా ఆ రాయబారికి అందజేశారు.

అనంతరం విమానంలో వచ్చిన పెట్టెను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య దాన్ని ఒక ట్రక్కులో తరలించారు. సిటీలో ఒక చోట అప్పటికే ఎదురు చూస్తున్న ముఖ్యమంత్రి... ఇతర అధికారుల ముఖాల్లో ఆనందం విప్పారింది.

పెట్టెను స్వయంగా తెరిచిన ముఖ్యమంత్రి... అందులోని 'మొక్క'ని అపురూపంగా తడిమారు.

అప్పటికే తవ్వి ఉన్న గుంటలో స్వయంగా... అందరూ విస్మయంగా చూస్తుండగా ఆ మొక్కని నాటారు.

ఆ మొక్క పెరిగి పెద్దదయ్యేలా... యాభై ఏళ్ల వరకూ ఓ ప్రైవేట్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

మర్నాటి పేపర్లలో ప్రముఖంగా ఫోటోల్తో వచ్చిన వార్త ఏమిటంటే...

"భారత భూభాగంపై... పెరగనున్న మరో మొక్క"

ఏనాడో అంతరించిపోయిన రకరకాల పక్షుల్ని, జంతువుల్ని చెట్లనీ గురించి పుస్తకాల్లో చదివి కంప్యూటర్లలో బొమ్మలు చేసిన పిల్లలకి, పెద్దలకి జీవితంలో దాన్ని ఓసారి చూడాలన్న కోరిక ఆ క్షణమే కదిలింది.

xxx xxx xxx

రాజ్‌భవన్‌కి కార్లో వెళ్తోన్న గవర్నర్‌కి అయిదేళ్ల మనవడు ఫోన్ చేశాడు.

"తాతయ్యా... ఆ మొక్కని ఓసారి చూపించవూ..." అని. గవర్నర్ వేదవ్యాస నవ్వారు.

"కాస్త పెద్దయ్యాక చూద్దువులే..." అన్నారు.

"తాతయ్యా... టైగర్‌ని చంపటం దారుణం కదూ... టీవిలో చూపిస్తున్నారు... దాన్ని చంపినవాడు కన్పిస్తే కాల్చేయాలి కదూ..."అన్నాడు అవేశంగా.

"సర్లే కాని... నువ్వు ఫోన్ పెట్టెయ్" అని కట్ చేసి... తన కార్లోని మినీ పోర్టబుల్ టివిని ఆన్ చేశారు.

పెద్దపులి అంత్యక్రియలు చూపిస్తూ... ఒక ప్రయివేట్ ఛానల్ విస్మయానికి గురి చేసే కొన్ని క్లిప్పింగుల్ని చూపిస్తోంది. అవి చూస్తున్న గవర్నర్ వేదవ్యాస ఆశ్చర్యపోయారు.

"రెండువేల సంవత్సరం అక్టోబర్ 28న హైదరాబాద్ అని పిలిచే ఆనాటి సిటీ జూపార్క్‌లో కొందరు దుండగులు తెల్ల పెద్దపులిని హత్యచేసి రక్తాన్ని తీసుకొని చర్మాన్ని వొలచుకుపోయారు.

'సాఖీ' అనే ఆ పెద్దపులి హత్య ఆనాడు రాష్ట్ర ప్రజల్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. దాదాపు వంద సంవత్సరాల కిందట 'సాఖీని చంపినా... ఆ నిజాలు ఇప్పటికీ బయటపడలేదు. క్షుద్ర పూజ కోసమే దాన్ని చంపినట్టు పత్రికలు అనుమానపడినా హంతకుల ఆచూకీ దొరకలేదు..."

సాఖీ అనే తెల్లపులికి సంబంధించిన ఫోటోలు తెరపై చూపిస్తున్నారు. సైన్సు ఎంత ఎదిగినా... మనిషిలోని మూఢత్వం మరింత పోటీపడి ఎదుగుతుండటం ఈ ప్రపంచం జీర్ణించుకోలేని వాస్తవం....

అందుకోసం ప్రకృతిని నాశనం చేయటం ఎంతటి బాధాకరం??

గవర్నర్ వేదవ్యాస బాధగా కణతలు రుద్దుకున్నారు.

మరోసారి పెన్‌ఫోన్ మోగింది...

అది సి.ఎం. నించి కావటంతో వేదవ్యాస టి.వి. ఆఫ్ చేశారు.

"సర్... నేను సి.ఎం. ని మాట్లాడుతున్నాను. మీ నించి ఓ సలహా కావాలి" అన్నారు.

"చెప్పండి"

"ప్రపంచబ్యాంక్ రుణం తీర్చమని ఒత్తిళ్లు చాలా ఎక్కువవుతున్నాయి. అయితే పదిహేను వందల కోట్ల మిలియన్ డాలర్ల రుణం తీర్చడానికి ప్రపంచ బ్యాంక్ ఓ కోరిక కోరింది. అది తీరిస్తే మూడు వంతుల రుణం తీర్చినట్లుగా అగ్రిమెంట్ కుదుర్చుకోవడానికి వాళ్లు సంప్రతింపులు జరుపుతున్నారు.

"ఏమిటా అగ్రిమెంటు?"

"రామ చిలకపైనా, కృష్ణ జింక పైనా పేటెంట్ హక్కులు అమెరికా దేశానికి అమ్మాలి"

గవర్నర్ హతాశుడయ్యారు.

ఆవేశంతో అతని ముఖం ఎర్రబడింది. అర నిమిషంలో ఒక నిర్ణయానికొచ్చి...

"సారీ... ఆ అగ్రిమెంట్ మీద సంతకం చేయకండి. మీ రాజకీయ నాయకులు ఒకప్పుడు విందులు, వినోదాలకు అరుదైన పక్షుల్ని, జంతువుల్నీ నాశనం చేశారు. ఈ మాత్రం మిగిలి వున్న అరుదైన ఆ పక్షిని, ఆ జింకనీ కాపాడుకుందాం. ఆనాటి సాఖి నించి ఈనాటి పెద్దపులి వరకూ ప్రకృతి మీద జరుగుతున్న దాడులన్నీ రాజకీయ హత్యలే కాబట్టి... దర్యాప్తులు కూడా రాజకీయమై మరుగున పడుతున్నాయి. ప్రకృతికి మనం పడ్డ రుణం ముందు... ప్రపంచ బ్యాంక్ రుణం ఏపాటిది? దయచేసి అర్థం చేసుకోండి. ప్రకృతిని పరులకు దారాదత్తం చేసే హక్కు దేవుడిక్కూడా లేదు..." అన్నారు ఆవేదనగా.. అవేశంగా...

వందేళ్లుగా గ్లోబలైజేషన్ పేరుతో చాపకింద నీరులా సాగుతున్న అమెరికనైజేషన్ పట్ల విచారం కల్గింది. అవతల్నించి ఏ సమాధానమూ రాకుండానే ఫోన్ కట్టయింది. గవర్నర్ కారు రాజ్‌భవన్ చేరింది కాని అప్పటికే... సెక్రెటేరియట్ లోని ఓ ఛాంబర్‌లో రామచిలక అందాలు... జింకపిల్ల సోయగాలపై నెత్తుటి సంతకాలు జరిగిపోయాయి... గ్లోబలైజేషన్ సాక్షిగా!

*

కథా నిలయం
శ్రీకాకుళం